క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ వెంటే బీసీలు



గవర కమ్యూనిటీ నాయకులను కలిసిన రాజగోపాలాచారి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని బీసీ లంతా వైఎస్సార్ సీపీకే మద్దతు తెలుపుతున్నారని పార్టీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. స్థానిక గవర కమ్యూనిటీ పెద్దలను శుక్రవారం ఆయన కలిసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని బలపర్చాలంటూ అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాజగోపాలాచారి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు అన్నింటా అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బీసీలు అభివృద్ధి చెందాలంటే బీసీలను హక్కున చేర్చుకునే వారికే మన మద్దతు ఇవ్వాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, అసెంబ్లీ అభ్యర్థి ఆళ్ల నానిలకు గవర కమ్యూనిటీ అంతా సంపూర్ణ మద్దతు ఇవ్వాలని గవర కమ్యూనిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొడ్డేటి సుబ్బారావు, పెదకంశెట్టి వెంకటేశ్వరరావులను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కింజంగి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్‌తో ప్రలోభాలకు చెక్



గుణ్ణంపల్లిలో సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారుడు ప్రశాంత్‌కుమార్

ద్వారకాతిరుమల: సీ విజిల్ యాప్‌తో ఎన్నికల ప్రలోభాలకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టవచ్చని కీర్తనా కల్చరల్ సొసైటీ కళాకారుడు ప్రశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని గుణ్ణంపల్లిలో ఉపాధి కూలీలకు శుక్రవారం ఆయన సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం, వినియోగం తదితర అంశాలను వివరించారు. ఏ ప్రాంతంలో అయినా ఓటర్లను ఆకర్షించే విధంగా డబ్బులు, మద్యం, బహుమతులు పంచుతున్నా, ఓటర్లను ప్రలోభ పెట్టేలా జరిగే కార్యకలాపాలను ఫొటో, వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాచేసిన 100 నిమిషాల్లోపు సంబంధిత అధికారులు ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారన్నారు. ఏలూరు జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగి, ఎథికల్ ఓటింగ్ జరగాలన్నదే జిల్లా కలెక్టర్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

ప్రజల చెంతకే ఆధునిక వైద్యం

- యూపీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం
- ఏలూరులో 5 నూతన అర్బన్ హెల్త్ సెంటర్లు
- ఒక్కో యూపీహెచ్‌సీకి రూ.80 లక్షల నిధులు
- ఎమ్మెల్యే ఆళ్ల నాని చొరవతో నిర్మాణం



ఏలూరు 30వ డివిజన్‌లో నిర్మించిన యూపీహెచ్‌సీ



పాతబస్టాండ్ సమీపంలో నిర్మించిన యూపీహెచ్‌సీ









యూపీహెచ్‌సీలో ల్యాబ్ (ఫైల్), యూపీహెచ్‌సీల్లో పరీక్షలు చేస్తోన్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్), యూపీహెచ్‌సీలో అందుబాటులో మందులు (ఫైల్)

ఏలూరు టౌన్: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు వైద్యానికి ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌పై ఆధారపడాల్సిన దుస్థితి. ఏదైనా పెద్ద జబ్బు చేస్తే అప్పులు చేసి మరీ కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునేవారు. ఒకవైపు అనారోగ్యంతో బాధపడుతూ, మరోవైపు అప్పులు చేయటం, ఉపాధి లేక జీవనం సరిగా లేని దైన్యస్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉండేవారు. పెద్దాసుపత్రికి వెళ్లినా ఆధునిక వైద్యం అందుబాటులో లేకపోవటంతో ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఆశ్రయించాల్సి వచ్చేది. ఇదంతా గతం.. ఈ దుస్థితికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెక్ పెట్టారు. ఆయన అధికారం చేపట్టిన అనంతరం ప్రభుత్వ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లతో ఆధునిక వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారు. ప్రజలు తమ నివాసిత ప్రాంతాలకు చేరువలోనే ప్రభుత్వాసుపత్రులు నిర్మించటంతోపాటు, వైద్య పరీక్షలకు ల్యాబ్‌లు, మందులన్నీ అందుబాటులో ఉంచారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వైద్యశాలల్లో డాక్టర్లు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరులో 5 యూపీహెచ్‌సీలు

ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు నూతనంగా నిర్మించారు. 13 విలేజ్, యూపీహెచ్‌సీలు మంజూరు కాగా, వాటిలో 5 యూపీహెచ్‌సీలు ఇప్పటికే నిర్మించగా, మరో 3 విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం పూర్తి చేశారు. ఒక్కో యూపీహెచ్‌సీని ఆయుష్మాన్ భారత్, నగరపాలక సంస్థ నిధులు సుమారుగా రూ.80 లక్షలు నుంచి రూ.90 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. విలేజ్ క్లినిక్‌లను సుమారు రూ.22 లక్షల నుంచి రూ.27 లక్షలతో నిర్మాణం చేపట్టారు. యూపీహెచ్‌సీలో ఒక వైద్యుడు, నర్సింగ్ స్టాఫ్, ఫార్మసిస్ట్, ల్యాబ్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. మరోవైపు ప్రతి వ్యక్తికీ వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు ఉచితంగా అందజేస్తున్నారు.

అందుబాటులో వైద్యం



ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం మంచిగా చేస్తున్నారు. ఇంటికి సమీపంలోనే ఆసుపత్రులు ఉండడంతో పేదలకు సౌకర్యంగా ఉన్నాయి. యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు ఇస్తున్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలో ప్రభుత్వాసుపత్రులు అన్ని సౌకర్యాలతో చక్కగా కట్టించారు. మాలాంటి వృద్ధులు, పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఆర్.నర్సమ్మ, ఏలూరు

జగన్‌తో పేదలకు మెరుగైన వైద్యం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. ప్రభుత్వాసుపత్రులు నిర్మించారు. పెద్ద అనారోగ్యం వస్తే ఏలూరు పెద్దాసుపత్రిలో వైద్యం అందుతుంది. ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్యం, ఆపరేషన్లు చేస్తూ పేదలను ఆదుకుంటున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని నగరంలో కొత్త యూపీహెచ్‌సీలను ప్రారంభించటంతో సమీపంలోని పేదలకు వైద్యం దగ్గరగా వచ్చింది.

– వై.మాలచ్చమ్మ, ఏలూరు వన్‌టౌన్

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరిన 33 కుటుంబాల సభ్యులు

పెదవేగి : వైఎస్సార్ సీపీలో చేరికల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం పెదవేగి మండలం కొండలరావుపాలెం కార్యాలయంలో, దెందులూరు మండల జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, సొసైటీ ప్రెసిడెంట్ పాకలపాటి వాసు, పార్టీ ప్రెసిడెంట్ నిట్టా గాంధీ ఆధ్వర్యంలో, జోగన్నపాలెం టీడీపీ నుంచి సుమారు 33 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యే అబయ్యా చౌదరి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు.

కేంద్రం ఉపాధి నిధులు విడుదల చేయాలి



పాలగూడెంలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఏలూరు రూరల్ : దేశంలో ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలకు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు అవసరమైతే, కేంద్ర ప్రభుత్వం రూ.63 వేలు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి ఆరోపించారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ కూలీలకు రూ.4.25 కోట్ల వేతనాలు బకాయిలు కేంద్రం వెంటనే విడుదల చేయాలని రవి డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ చేయాలని, నీడ కోసం టెంట్లు వేయాలని, పనిముట్లు అందించాలని కోరారు. సీఐటీయూ నాయకులు పల్లం కిషోర్ తదితరులు ఉన్నారు.

వలంటీర్లపై చంద్రబాబుది కపట ప్రేమ

బుట్టాయగూడెం: ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు వలంటీర్లపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిపారని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వలంటీర్ సేవలను విమర్శిస్తూ వారిని మానసిక వేదనకు గురిచేసేవారని విమర్శించారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మొద్దని ఆమె అన్నారు. పార్టీ మండల కన్వీనర్ చంద్రా ప్రసాద్ పాల్గొన్నారు.

శశి ఏలూరు విద్యార్థుల ప్రతిభ



అత్యధికత మార్కులు సాధించిన విద్యార్థి, తల్లిదండ్రులను అభినందిస్తున్న మాధవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించారని శశి కళాశాల క్యాంపస్ ఇన్‌చార్జి కేఎస్ఎస్ మాధవ్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పి.శైలు 979, ఎస్ సారా 974, ఎం శ్యామ్ సాయితేజ 968 మార్కులు, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో వి.చరణ్ నాగ కృష్ణతేజ్ 465, వీఎస్ఎస్ షణ్ముఖ శర్మ 459, కె.యశ్వంత్ 458 మార్కులు సాధించారని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాలలో శుక్రవారం పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను కళాశాల ఇన్‌చార్జి పి.ఉమా గోవిందరావు, శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ నరేంద్ర కృష్ణ, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర కమిటీల్లో నియామకాలు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నగర కమిటీ, అనుబంధ కమిటీల్లోకి పలువుర్ని నియమించారు. ఏలూరు నగర ప్రధాన కార్యదర్శిగా పాతివలస రాజేష్, ఏలూరు నగర మైనార్టీ సెల్ సెక్రటరీగా ఎస్కే బాజీ, ఏలూరు నగర బీసీ సెల్ కార్యదర్శిగా అల్లు అప్పలనాయుడును నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు.

కమ్యూనిస్టు నేత మాకినేనికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో మాకినేని బసవ పున్నయ్య పాత్ర ఎనలేనిదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మార్క్సిస్టు అగ్రనేత బసవ పున్నయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక పవరుపేట సీపీఎం కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పి.కిషోర్, కె.విజయలక్ష్మి, జి.శారద, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, ఎస్ సత్యనారాయణ, జె.చంద్రశేఖర్, జి.కోటేశ్వరరావు, మీసాల సత్యం, సింహాచలం పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం

పెదవేగి : గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేను సిద్ధం..మా ఊరు సిద్ధం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పెదపాడు మండలం అప్పనవీడులో శుక్రవారం రాత్రి ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో గుడిపాడులో సొసైటీ చైర్మన్ అక్కినేని రాజశేఖర్ నేతృత్వంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్దె రామసీత, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ మరుమూడి కృపామని, ఘంటశాల ప్రభాకర్, గెద్దం తిరుపతిరావు, ముప్పల వేణు, ఘంటశాల నాగసత్యం, ముప్పల దుర్గారావు, జయమంగళ కేశవ, ఘంటశాల పొన్నయ, పిట్టా సంతోషం, కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి ముండూరులో అఖిల భారత మహాసభలు



ముండూరు యాజ్ఞ వల్క్య రాజాశ్రమంలో మాట్లాడుతున్న పీఠాధిపతులు

పెదవేగి : పెదవేగి మండలం ముండూరులోని యజ్ఞ వాల్క్య రాజాశ్రమంలో ఈనెల 14, 15, 16వ తేదీల్లో 66వ వార్షికోత్సవ అఖిల భారత మహాసభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్టు ఆశ్రమం పీఠాధిపతులు శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామి తెలిపారు. శుక్రవారం యాజ్ఞ వల్క్య రాజాశ్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదవేగి మండలం ముండూరులో 1958లో ప్రబోధానంద గిరి స్వామి ఈ ఆశ్రమం ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ఏటా అఖిల భారత మహాసభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆశ్రమాధిపతులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చిత్స్వరూపానంద స్వామి, పరమానంద స్వామి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	72
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	04,06
బెండకాయలు	22	కంద	64
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	34	కీరా దోస	30
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	40	అల్లం	170
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-36	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	గోంగూర	08
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	26

కొల్లేరు గ్రామాల్లో వలంటీర్ల రాజీనామా



రాజీనామ పత్రాలతో గుడివాకలంక వలంటీర్లు



రాజీనామా చేసిన గుండుగొలను వలంటీర్లు



ఎంఎంపురంలో రాజీనామా చేసిన వలంటీర్లు



పోలసానిపల్లిలో వలంటీర్ల రాజీనామా

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఏలూరులోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తున్నప్పటికీ తమను జనసేన, టీడీపీ నాయకులు రాజకీయంలోకి లాగారని, నాయకుల తప్పుడు ఆరోపణ చేయడం వల్ల తీవ్ర మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నామని చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం పనిచేసి ప్రజల మన్ననలు అందుకున్నామని తెలిపారు.

దుష్ప్రచారం దుర్మార్గం

భీమడోలు: ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తున్న వలంటీర్లపై టీడీపీ కూటమి నేతలు దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమడోలు మండలం గుండుగొలను సచివాలయాలు -1, 2, 3 పరిధిలో 41 మంది, పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం సచివాలయం పరిధిలో 11 మంది, పోలసానిపల్లిలో 4, కోడూరుపాడు ముగ్గురు, భీమడోలు 4, కురెళ్లగూడెం, 7, అంబర్‌పేట 6, సూరప్పగూడెం 1 చొప్పున వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు శుక్రవారం అందజేశారు. ఇప్పటి వరకు వలంటీర్లను తిట్టిపోసి మానసికంగా దెబ్బతీసిన చంద్రబాబు తాను గెలిస్తే వలంటీర్లుకు రూ.10 వేల జీతం పెంచుతానని చెబుతున్నారని, అదే కూటమిలోని పవన్ కల్యాణ్ తమపై ఇష్టానుసారంగా అనుచిత వ్యాఖ్యలు చేసి తాను గెలిస్తే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని, తమపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

విప్లవాత్మక సంస్కరణలతో ప్రజారంజక పాలన

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి

దెందులూరు: ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలి, సంక్షేమం పొందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీర్ఘకాలిక ప్రణాళికలు, విప్లవాత్మక సంస్కరణలతో ప్రజారంజకపాలన సాగించారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. చల్లచింతలపూడి బస్టాండ్ సమీపంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో చేరిన ఎంపీటీసీ, 60 కుటుంబ సభ్యులను స్వాగతిస్తున్నానన్నారు. దెందులూరు నియోజకవర్గంలో శాంతి, సామరస్య వాతావరణం, అభివృద్ధి, సంక్షేమం ఎవరి హయాంలో మెరుగ్గా ఉందో ప్రజలంతా గమనించాలని కోరారు. అన్ని పార్టీల సహకారం తీసుకుని ఏదొక రకంగా అందలం ఎక్కాలని, చంద్రబాబు అమలు కాని హామీలిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు.

సీనియర్ నాయకులు చలమోలు అశోక్‌గౌడ్‌ను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ అభినందించారు. గౌడ సామాజిక నాయకుడిగా, పార్టీలో చేరిన వెంటనే చల్లచింతలపూడిలో టీడీపీ ఎంపీటీసీ, 60 కుటుంబాలను వైఎస్సార్ సీపీలో చేర్పడం పట్ల ఆయన్ని అభినందించారు. కార్యక్రమం సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, జెడ్పీటీసీ నిట్టాలీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పార్టీ నాయకులు ఊదరగొండ చంద్రమౌళి, సర్పంచులు యలమర్తి రేవతి రామకృష్ణ, పరసా లక్ష్మీసుజాత కనకరాజు, మెండెం సంతోష్‌కుమార్, సొసైటీ చైర్మన్లు కొలుసు గణపతిరావు, నల్లూరి వెంకట్రామయ్య (బాబి), కొమ్మిన రాము, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో కలిసి నాయకుల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్, గౌడవీధిలో భారీ ర్యాలీ నిర్వహించారు.